# మధుమూర్తి



ఆఫీసులో పనిచేస్తున్నా, స్నేహితులతో తిరుగుతున్నా, సినిమా చూస్తున్నా ఎప్పుడూ ఒకటే వ్యథ—'నా ప్రాణంమీదికి ఈ మధుమూర్తి ఎక్కడ దాపరించాడురా' అని.

ఎంత వద్దనుకున్నా, 'వాడుమాత్రం పైవాడా' అని ఎంత ఉపేక్షిస్తున్నా ఇంట్లో ప్రతి పనిలోనూ, ప్రతి మాటలోనూ వాడి ఆధిక్యమే అయితే? కన్నతల్లి, కట్టుకొన్న భార్య కూడా తనను, తన ఉనికిని చులకనచేస్తుంటే,

ఎవరు శత్రువులో, ఎవరు మిత్రులో తెలుసుకోగలిగిన శక్తి పసిపిల్లలకు ఉన్నంతగా ప్రాజ్ఞత వచ్చినవారిలో కనిపించదు. ప్రేమించినవారి చేతుల్లో ఎన్ని కష్టాలనైనా చిరునవ్వుతో సహించి దానినే స్వర్గంగా భావించుకోగల శక్తి కూడా వారికి ఉంది. అందుచేతనే కాబోలు పెద్దలు భరించలేని దెబ్బలు సహితం ఆ అమాయకులకు తగులుతుంటాయి!

# మధుమూర్తి

మగవాడికయినా ఎలా ఉంటుంది?

ఏ ఘడియలో ఈ మధుమూర్తి ఇంట్లో కాలుమోపేడో కాని, సరోజ మనసును పూర్తిగా వశం చేసుకొన్నాడు. అంతకుపూర్వం—ఈ నూతన బంధుత్వం కలగకపూర్వం—తనంటే ఎంత ప్రేమగా ఉండేది! తనకు ఏ క్షణానికి ఏది కావాలో నోటిలోమాట నోటిలో ఉండగానే ఇట్టే అమర్చిపెట్టేది. ఇంట్లో ఉన్నంతసేపూ, ఒక్కక్షణమయినా విడిచి వేరుగా ఉండేదికాదు. అయినవాటికీ, కానివాటికీ తను అల్లరి పెడుతుంటే, "మరీ చంటిపిల్లాడిలా ఏమిటండీ, ఆ పంతాలు? ఎవరయినా వింటే నవ్విపోగలరు" అని నవ్వుతూ మందలించేదేగాని, విసుక్కొనేది కాదు.

కాఫీ కప్పుతో శ్రీమతి దర్శనం అయేదాకా నిద్రలేవడం అన్న ప్రశ్నే ఉండేదికాదు. ఉత్సాహంతో ఉరకలువేస్తూ, పరవళ్ళుతొక్కే ఆ జీవితం, ఆ రోజులే వేరు.

"నిద్రలేచింది మొదలు, ఆఫీసుకెళ్ళేదాకా 'సరూ, సరూ!' అని అలా కాకిగోల పెట్టకపోతే, నీ పనులు నువ్వు చేసుకోడం నేర్చుకోరాదుటరా? ఆ పిల్లమాత్రం ఎంతకని పరుగులు పెడుతుంది?" అనేది అమ్మ.

నా పనులు నేను చేసుకోలేకనా, సరూను పిలుస్తాను? అందాలరాశి అయిన సతీమణి చేతితో సపర్యలు అందుకొనడంలో ఉన్న ఆనందం, సౌఖ్యం అమ్మకేం తెలుస్తాయి?

"ఇద్దరు బిడ్డలతల్లి అయ్యేవరకు పగటిపూట పతికి ఎదురుపడి మాట్లాడేవాళ్ళమా? మరీ పిదపకాలం వచ్చిపడింది. పెళ్ళాయి ఇంట్లో కాలుపెట్టిన దగ్గరినుంచి, పెళ్ళాం కళ్ళెదటే ఉండాలి. ఇది రాత్రి, ఇది పగలు అనిలేదు. ఒకటే పకపకలు, ఒకటే గుసగుసలు. ఏంకాలమో, ఏం పిల్లలో" అని ఆక్షేపించేది అమ్మ.

"తాము పొందలేకపోయిన సుఖ సంతోషాలు ఈతరంవాళ్ళు ఎందుకు పొందాలి? అన్న ఉడుకుమోత్తనం ఈ పెద్దవాళ్ళలో ఎంతగా ఉంటుందో చూసేవా, సరూ? మనమేమయినా అంటే, మంచీ మర్యాదా, వినయం విధేయతా లేవంటారు. నిజమేనా, సరూ!" అంటే తమాషాగా నవ్వి, సన్న సన్నగా జారుకొనేది. అబ్బో! ఈవిడమాత్రం తక్కువదా? ఆ అత్త కోడలేగా!

అత్తదగ్గర అత్త ఆట, నా దగ్గర నాపాట. ఎంత నాటకమైనా ఆడేందుకు, ఎంతలాటివారినైనా తన వేలు చుట్టూ తిప్పుకొందుకు తగి ఉన్నాయి ఆ కళ్ళు.

తిలకం దిద్దుకొని వస్తే, ఆ కళ్ళు చూసేగా,

పదివేలు విలువచేసే తను పైసాకట్నం అక్కరలేదని సరోజను చేసుకొన్నది?

"ఈ రూపురేఖలు చూసి మోసపోకురా, అబ్బాయీ! అంచక్కా పదివేల కట్నంతో, పనిపాట్లు తెలిసి ఉన్న పున్నమ్మని చేసుకోరా" అని—ఆ పిల్ల అసలు పేరు పూర్ణిమలెండి—అమ్మ చెబుతూనే ఉంది.

"పున్నమ్మ నల్లగా ఉంటుంది. నా కొద్దు" అని, ఎర్రగా బుర్రగా ఉన్న సరోజ చూపులకు, మాటలకు భ్రమసిపోయి, కట్నం అన్నమాట రాకుండానే "సరే" అన్నాడు తను.

ముచ్చటగా మూడేళ్ళయినా గడవకుండా, తన సరూ తనను నడిగంగలో దింపుతుందని తెలిస్తే, ఆ వగలు, ఆ ప్రేమలు—అన్నీ ఆడవారు తమ అవసరం తీరేదాకా ఉపయోగించే మత్తుమందులే అని ఆదిలోనే గ్రహించగలిగితే వచ్చినా ఈ పెళ్ళి చేసుకొనేవాడా?

తృప్తిగా పంచభక్ష్య పరమాన్నాలు తిని, ఎత్తిపారవేసిన ఎంగిలి విస్తరిలా, తన పని మూడు నాళ్ళ ముచ్చటే అని తెలిస్తే ఇంత చనువిచ్చి, అంత వలపిచ్చి ఆమెకు లోకువ అయ్యేవాడా?

ఆమె పలికిన ప్రతిమాటా, ఆమె చూసిన ప్రతి చూపూ ఆమె అనురాగలతనుండి వికసించిన పుష్పాలే అనుకొని మురిసిపోయేవాడు. ఉదయ సంధ్యలలో దైవసాన్నిధ్యాన ఆమె చేసే ప్రార్థనలకు, తామిరువురూ రాధామాధవులుగా ఊహించుకొని, ఆ ప్రేమామృతం అంతా తనకే చెందుతుందని తృప్తిపొందేవాడు.

"ఇదంతా నీఊహేకాని, ఆమె మాటమాత్రమయినా 'సుబ్బారావుగారూ, మిమ్మల్ని ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాను. నాకు మీ ప్రేమ ఒక్కటే నిత్యం, సత్యం. ఇతరం నాస్తి' అని యాదమరిచి అయినా అన్నాదా?" అనేకదా మీ ప్రశ్న?

నన్ను మరీ అంత తెలివి తక్కువ దద్దమ్మ కింద జమకట్టకండి. ఆడవాళ్ళ చేతలకు, మాటలకు ఎప్పుడూ పొంతన ఉండదని మన పెద్దలు ఎప్పుడో వ్రాసిపెట్టేరుకదా? నోటితో చెబితే నమ్మకనే పోదును. కాని, ఆ చేష్టలున్నాయి చూసేరూ? వాటినిమాసి కూడా, ఆమెప్రేమను

**ద్వివేదుల విశాలాక్షి**

శంకించేనంటే నరకద్వారాలు నాకోసం బారుగా తెరిచి ఉంటాయి. ప్రతి చిన్న సన్నివేశం ఒలిచిన అరటిపండేకదండీ! ఉదాహరణకు— ఊఁ ఎందుకులెండి? ఇప్పుడు అదంతా గతజల సేతుబంధనమే అవుతుంది.

అది ఈ సుబ్బారావు జీవితానికో స్వర్ణయుగం. గతించినకాలం తిరిగిరాదు. మిగిలేవి మంచి, చెడుల అనుభూతులు మాత్రమే.

చీకటి వెనక వెన్నెల రాదా? సరోజపై ఈ మధుమూర్తిగాడి ప్రభావం శాశ్వతంగా నిలిచి ఏడుస్తుందా? ఏనాటికయినా సరోజ మళ్ళీ నా 'సరూ' కాకపోతుందా? అనే ఆశతోనే జీవిస్తున్నాను.

నా జీవితం సరోజతో లతలా పెనవేసుకుపోయింది. కాని మధుమూర్తికేం? వాడి జీవితం, వాడి సంసారం వాడికి ఉండనే ఉంటాయి. ఎల్లకాలం సరోజనే పట్టుకు కూర్చుంటాడా? కాలం కలిసి వచ్చేదాకా ఓపికపట్టడం మినహా చేయగలిగింది ఏమీలేదు—అని సమాధానపరుచుకున్నాను.

బయట ఉన్నంతసేపూ చేసుకున్న నిర్ణయాలు, ఇల్లు చేరుకొనేసరికి గాలికి చెదిరిపోయే మేఘాల్లా ఎక్కడెక్కడికో పరుగులు తీస్తాయి. నాకోసం పూర్వంలా ఎదురుచూసే సరోజ కనిపించకపోయేసరికి, నా అక్కసు మధుమూర్తిమీదికి లేస్తుంది.

"సరూ ఏదమ్మా?" విసుగ్గా ప్రశ్నిస్తాను.

"మేడమీద ఉన్నాదిరా."

"ఆ మధుమూర్తిగాడో?"

"వాడు దానిదగ్గరే ఉండి ఉంటాడు. కాని, ఏమీ నాపీ, పరసాలేనట్టు అలా పేరుపెట్టి పిలవడమేమిటి?" అని కోప్పడుతుంది అమ్మ. నా ఆవేదన అమ్మకేం తెలుస్తుంది? నాకు వాడు చేసిన అన్యాయం? నావి, పరస నిలుపుకొనే పనేనా, అది? నా సరూ నా పట్ల ఇంత ఉపేక్ష వహిస్తున్నదంటే దానికి కారకులెవరు? ఆ మధుమూర్తికాడా?

అమ్మకు ఆ పేరంటేనే అమితమయిన ఆప్యాయం. ఇంక ఆ పేరున్న వ్యక్తిమీద ఆమెకు ఉన్న అభిమానానికి హద్దులేలేవు. "మధుని చూస్తుంటే ఏనాటి రోజులో మదిలో కదులుతాయిరా" అంటుంది.

• • •

జన్మానికో శివరాత్రి అన్నట్టు ఆఫీసునుంచి ఇంటికి చేరేసరికి సరోజ వీధిగుమ్మంలో ముస్తాబయి నిల్చుంది. నా మనసు ఆనందంతో ఊగిపోయింది. ఆ పది అడుగులు నడిచేలోపునే ఎన్నో ఆలోచనలు—ఇంత శుభప్రదమైన ఈ సాయంకాలాన్ని ఎలా సద్వినియోగపరుచుకోనా అని.

సినిమాకు పోతే? సరిగ్గా వేళకుఒక్కటే మంచి సినిమా లేనట్టుంది. "ఆ అమ్మమ్మల కథలు నేచూడలేను, బాబూ!" అంటుంది సరోజ. ఆఁ!

అన్నట్లు—పొద్దుటే "అశోక్‌లో మంచి పిక్చరున్నది. ఈరోజే ఆఖరట. వచ్చేటప్పుడు టిక్కెట్లు తెండి" అన్నాది సరోజ. ఏమిటి చెప్మా? సరిగ్గా వేళకు మధు అక్కడికి తయారవడంతో కోపంగా ఆఫీసుకు వెళ్ళిపోయేడు తను.

పోనీ బీచికి పోతే? ఈ వేసవికాలం మూలాన, వాళీచాలని కొంపల్లో చెమటలు కార్చుకోలేక, ఊరు ఊరంతా అక్కడే తగలడుతున్నారు. సమయానికి ఏ స్నేహితులో పానకంలో పుడకల్లాగ తయారయ్యారంటే.... అన్నిటికంటే ఉత్తమమయిన పని—హాయిగా డాబామీద కూర్చుని కబుర్లు చెప్పుకొంటే? అది మొదటికే మోసం! తన విసనకర్ర, చాపచుట్ట పట్టుకొని అమ్మ, ఆమె వెనకాలే వారి ఆపేక్ష చూరగొన్న మ....

'సరే. సరాసరే అడుగుతాను, ఏంచేద్దామంటుందో' అని నిర్ణయం ఆమెకే వదిలివేసేను అలవాటు ప్రకారం.

వీధి మెట్లెక్కుతూ "ఏం, సరూ, ఎవరికోసం నిరీక్షణ?" అన్నాను.

"మీకోసమే" అన్నాది విస్పంకోచంగా.

"అబద్ధం" అన్నాను అనాలోచితంగా. నా గొంతు కాస్త కరుకుగానే ధ్వనించింది.

సరోజ ముఖంలోని నవ్వు రంగు వెలిసిపోయింది. సూర్యాస్తమయం తరువాత మిగిలిన కాంతిరేఖలా ఆ ఛాయలుమాత్రం కొద్దిగా మిగిలి ఉన్నామంటున్నాయి.

"ఇంకెవరికోసమో అని ఎలా అనుకొన్నారు?" ఎదురు ప్రశ్నవేసింది.

"చాలాకాలంగా లేని అలవాటుకదా?" నా మాటలోని వ్యంగ్యం సరోజ అర్థం చేసుకోగలదు. సంభాషణ పెడదారి పడుతున్నట్లు గ్రహించేను.

"ఓరి దద్దమ్మా! రాకరాక వచ్చిన అవకాశాన్ని నీ కుళ్ళుమాటలతో జార విడుచుకున్నావంటే, నిన్ను చూసి ఎవ్వరూ జాలిపడరు. చివరికి నేను కూడా!" మనస్సు హెచ్చరించింది.

తొందర తొందరగా ముఖానికి ఇంత నవ్వు పులుముకొని, మనస్సులోని ఈర్ష్యను కాళ్ళకింద నొక్కిపెట్టి, "నేను వచ్చేసేనుగా? పద, లోపలికి పోదాం" అన్నాను. నామాట నాకే చప్పగా వినిపించింది.

సరోజ దృష్టి ఇంకా వీధివైపే ఉన్నాది. నా సందేహం నివృత్తి అయింది. సరోజ ఇంకెవరికోసమో చూస్తున్నాది. ఆమె నిరీక్షణ భాగ్యానికి నోచుకొన్న ఆ అదృష్టవంతుడిని నేను కాను.

"మీరు లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకొంటుండండి. ఇప్పుడే వస్తున్నాను. పార్వతి, మధు టాక్సీ తీసుకొస్తామని వెళ్ళేరు. అరగంటకావస్తున్నా ఇంకా రాలేదేమా అని చూస్తున్నాను. సినిమాకి వేళ అయిపోతున్నాది. ఈరోజు మీరు కూడా కొంచెం ఆలస్యంగానే వచ్చేరు" అన్నాది నావైపుచూస్తూ. "ఫరవాలేదులెండి. మీ సంగతి నాకు తెలియందా? మీరెలాగూ తేరని తెలిసే, పక్కింటి వారబ్బాయిచేత టిక్కెట్లు తెప్పించేను. ఆఫీసులో అడుగుపెట్టేక మీకు ఇంటి గొడవ జ్ఞాపకం ఉంటుందా?" అన్నాది సరోజ, నా మనసంతా పుస్తకంలోని పాఠంలా చదివేస్తూ. "వాళ్ళు ఏ నిమిషానయినా వస్తారు. మీరు త్వరగా తయారుకండి" అన్నాది మళ్ళా తనే.

చావిట్లో కాలు పెట్టేసరికి వీధి గుమ్మంలో టాక్సీ ఆగింది. అందులోనుంచి పార్వతి, మధు మూర్తి దిగుతున్నారు. సరోజ భారంతీరినట్లు నిట్టూర్చింది. ఆమె ముఖం మబ్బు విడిచిన జాబిల్లిలా ప్రకాశించింది.

సరోజను చూస్తూనే విప్పారిన ముఖంతో, ఉత్సాహంగా ముందుకు వచ్చేడు మధు.

మధును దగ్గరగా తీసుకొని బుగ్గమీద సున్నితంగా ముద్దుపెట్టుకొన్నాది సరోజ.

"అమ్మా, అమ్మా! మరేమోనే.....నాన్నార్ని నేను లోడ్డుమీద చూసేనే. నాన్నాలు నన్ను చూడేలేదు" అన్నాడు మధు, ఏదో మహత్వపూర్ణ సన్నివేశాన్ని వర్ణిస్తున్నట్లు ముఖ భంగిమలు మారుస్తూ. ★

# చరమచరణం

## క్రోవ్విడి రవి

**ఆశయాల** అలమటింపుతో అనవకాశపు ఆవేశాలతో
నిరంతర సంతత ప్రవాహ ఝరులతో ఊగిసలాడుతూ
అనుక్షణం కంపింపజేస్తుంది నా ఆశల నావ.
ఆణిముత్యాల కోసమా యీ అన్వేషణ, నిరంతర ప్రయాస?
ప్రకృతికి అవలంబన మీ అభ్యంతర ప్రయాణం.
మరి, ప్రతి పనికీ అర్థం వుండితీరుతుంది!
నా కొద్దీ బాహ్యాడంబర ప్రపంచం
నాకు సయించదు పటాటోప మణుమాత్రం.

నా నరాల్లో రక్తంలా, నా స్వప్నంలోని సామ్రాజ్యంలా
ఉజ్వలంగా ప్రసరించే కాంతికోసం, కల్పతరువు కోసం
వెదకడంలో ఈమాత్రపు శ్రమ ఏపాటిది?
ఒకింత నిస్పృహ, మరింత నీరసం
తలిస్తే చాలు తలదన్ని కూర్చుంటాయి.
అందుకే అవంటే తీరని అసహ్యం.
ఐనా వాటి అనుబంధం వెన్నాడుతూనే వుంటుంది విరహ స్మృతిలా!

కాలంతోపాటు తాళం, తదనుగుణంగా
నా రక్తనాళాలు పరిమితంగానే ప్రవర్తిస్తాయి
ఎప్పుడో పొంగి పొర్లిపోతుంది, నా జీవిత సర్వస్వం
మిగిలేది శూన్యం!
మరి నాకోసం వెదుకుతాయా నా ఫలిత లక్ష్యాలు?
నన్ననుక్షణం వెంటాడి వేధిస్తాయా?
ఎక్కడికీ అగమ్యగోచర హృదయ గమ్యం?
అంతు తెలీని మార్గానికి మరణం శరణ్యం
ముగింపు కోసమే యీ చరమచరణం.